క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

కందుకూరు: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, వైస్ ఎంపీపీ జి.శమంతప్రభాకర్‌రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, సరికొండ మల్లేష్, మండల కోఆర్డీనేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సులేమాన్, నర్సింహ, శ్రీధర్‌ముదిరాజ్, వెంకట్‌రాంరెడ్డి, భూపాల్‌రెడ్డి, ఆంజనేయులు, సత్యనారాయణ, వెంకటేష్, వినోద్‌చారి, అజీజ్, ఈశ్వర్‌గౌడ్, పాండుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలు వెలిగించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న ధన్‌రాజ్ గౌడ్, వంశీధర్ రెడ్డి

తుర్కయంజాల్: సాగర్ రహదారిపై వీధి దీపాలు వెలిగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఇంజాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు గుండ్లపల్లి ధన్‌రాజ్ గౌడ్, బొక్క వంశీధర్ రెడ్డిలు బుధవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ గుర్రంగూడ చౌరస్తా నుంచి ఇంజాపూర్‌కు రోడ్డు మధ్యలో వీధి దీపాలు వెలగకపోవడం వల్ల తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయంలో వెంటనే చర్యలు తీసుకోవాలని కమిషనర్ బి సత్యనారాయణ రెడ్డిని ఆదేశించారు.

బోరుమోటార్ల ఏర్పాటుకు చేయూత



బోరును ఆన్ చేసిన హరినాథ్‌రెడ్డి

కొత్తూరు: మండల పరిధిలోని తీగాపూర్ గ్రామంలో బోరు మోటార్ల ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే సుమారు రెండు లక్షలు ఆర్థికసాయం చేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో నీటి సరఫరా చేసే బోర్లు తరచూ పాడైపోతుండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సాయం చేసినట్లు వివరించారు.

ఇంటర్‌లో పేదింటి బిడ్డల సత్తా

ప్రభుత్వ కళాశాలల్లో రాణించిన విద్యాదీపికలు

కందుకూరు: ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రభుత్వ మోడల్, జూనియర్ కళాశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. ప్రథమ సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో నేదునూరు మోడల్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎంపీసీ విభాగంలో పోలా తేజశ్విని 421, జాల రమ్యా 418, భట్టు నవ్య 417 మార్కులు, బైపీసీ విభాగంలో గోపాల్‌దాస్ పూజిత 429 మార్కులు, ముస్కాన్ 427, గోపాల్‌దాస్ రమ్యశ్రీ 421, అంకగళ్ల సుజిత 414, సీఈసీలో సంగం అశ్విని 443 మార్కులు సాధించారు. కొత్తగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు టి.చైతన్య 426, ఆర్.సుమిత్ర 458 మార్కులు సాధించింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ ఫలితాల్లో మోడల్ కళాశాల విద్యార్థులు అనేగౌని శృతి 968, అనేగౌని మానస 896, వి.శృతి 887, ఎండీ ఖాతూన్‌బేగం 845, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు బి.యోగేశ్వరి 831, పి.బద్రీనాథ్ 823 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో మోడల్ కళాశాల విద్యార్థులు కాకర్ల కార్తీక్ 977, ఎన్.అఖిల 939, బట్టు హర్షిత 968, ఎడ్ల శ్రావ్య 883, జాదవ్ మోఘ 931, బి.శివాని 927 మార్కులు సాధించారు. సీఈసీ విభాగంలో మోడల్ కళాశాల విద్యార్థులు పల్లె స్వేత 898, బండ స్వాతి 896, మల్‌దేవి గణేష్ 845, మీగడి సింధూ 808, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు దామోదర్ చౌదరి 895, కె.నవీన్ 828 మార్కులు సాధించారు. కాగా నేదునూరు మోడల్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 51 శాతం, ద్వితీయ సంవత్సరం 67 శాతం ఫలితాలు వచ్చాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 50 శాతం, ద్వితీయ సంవత్సరం 70 శాతం సాధించారు.



కాకర్ల కార్తీక్ (977), బైపీసీ



ఎన్.అఖిల (939), బైపీసీ



జాదవ్ మేఘ (931), బైపీసీ



ఎ.శృతి (968), ఎంపీసీ



పి.తేజశ్విని (421), ఎంపీసీ



జి. పూజిత (429), బైపీసీ



ముస్కాన్ (427), బైపీసీ



టి.చైతన్య (426), బైపీసీ



ఆర్.సుమిత్ర (458), సీఈసీ



సంగం అశ్విని (443), సీఈసీ

మహేశ్వరంలో ఉత్తమ ఫలితాలు



కె.జోత్స్న (450), ఎంపీసీ



జె.నిషాంత్ (430), బైపీసీ



ఆర్.సంధ్య (915), ఎంపీసీ



డి.పవిత్ర (948), బైపీసీ



ఎం.శ్రీశాంత్ (478), సీఈసీ

మహేశ్వరం: ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో మహేశ్వరం విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. మోడల్ కళాశాల ఫస్ట్ ఇయర్‌లో 140 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 80 మంది ఉత్తీర్ణులై 60.70 శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌లో 107 మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందులో 70 మంది ఉత్తీర్ణులై 65.42 శాతం ఉత్తీర్ణత పొందారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో గ్రూపులో కె.జోత్స్న 450, బైపీసీలో జే.నిషాంత్ 430, సీఈసీలో ఎం.శ్రీశాంత్ 478 అత్యధికంగా మార్కులు సాధించి సత్తా చాటారు. ఇంటర్ సెకండియర్‌లో ఎంపీసీ గ్రూపులో ఆర్.సంధ్య 915, బైపీసీలో డి.పవిత్ర 948 మార్కులు, ఎంఈసీలో ఎం.స్వప్న 913, సీఈసీలో వి.మనీష్ తేజ 816 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రభుత్వ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ బి.ధనుంజయ్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

మెరుగైన ఉత్తీర్ణత శాతం

మహేశ్వరం: మహాత్మా జ్యోతిరావు పూలే ఇంటర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించి సత్తా చాటారు. మొదటి సంవత్సరం 122 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 100 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 126 మంది పరీక్షలు రాయగా 113 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీలో ఎన్.మహేష్ 989, బైపీసీలో బి.శ్రీహరి 958, ఎంఈసీలో ఎం.నవదీప్ 964, హెచ్‌ఈసీలో కె.పరమేశ్వర్ 957, సీఈసీలో జి.రాధాకృష్ణ 942 మార్కులు సాధించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

మహేశ్వరం: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఫస్ట్ ఇయర్ ఇంటర్ ఫలితాల్లో 145 మంది పరీక్షా రాయగా 87 మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండ్ ఇయర్‌లో 159 మంది పరీక్ష రాయగా 108 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. ఎంపీసీలో మనీష్‌కుమార్ 905, బైపీసీలో బ్లెస్సీ 832, సీఈసీలో వి.స్వాతి 838 మార్కులతో సత్తా చాటారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ఎంపీసీలో లహరి 466 మార్కులు సాధించారు.



లహరి (466), ఎంపీసీ

సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కాళాశాలలో..



ఎం.పల్లవి, (969), ఎంపీసీ



బి.ప్రవలిక, (899), ఎంపీసీ



ఎస్.శివాని, (908), బైపీసీ



యూ.అరుణ, (865), బైపీసీ

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 217 మంది పరీక్షలకు హాజరు కాగా 71 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 206 మంది పరీక్ష రాయగా 105 మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండ్ ఇయర్ ఎంపీసీలో పల్లవి 969 మార్కులు సాధించారు. ప్రవలిక 899 మార్కులు పొందారు. బైపీసీలో ఎస్.శివాని 908, యూ.అరుణ 865 మార్కులతో సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ ఒకేషనల్‌లో జి.మనీషా 902, పీ.సంతోష 886 మార్కులు పొందారు. మొదటి సంవత్సరంలో ఎంపీసీలో కే.రాజేష్ 451, జి.దార్తి 450 మార్కులు సాధించారు. ఫస్ట్ఇయర్ బైపీసీలో మధియా 412 మార్కులు సాధించారు.

విద్యార్థినికి ప్రిన్సిపాల్ సత్కారం

హుడాకాంప్లెక్స్: ఇంటర్ ఫలితాలలో సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. సరూర్‌నగర్‌లో వంట పనులు చేసే మేకల రాములు కూమార్తె పల్లవి ఎంపీపీలో (1000/969) మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిందని ప్రిన్సిపాల్ జి.రాణి తెలిపారు. ఈ సందర్భంగా కాలేజ్‌లో పల్లవికి శాలువా కప్పి సత్కరించారు.



పల్లవిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ రాణి

మీర్‌పేటలో 45 శాతం ఉత్తీర్ణత



సేవేందర్‌చారి, (960), ఎంపీసీ

మీర్‌పేట: మీర్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాల 45 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ జి.సైదులు తెలిపారు. మొదటి సంవత్సరంలో మొత్తం 155 మంది పరీక్ష రాయగా 44 శాతం ఉత్తీర్ణులయ్యారని, ద్వితీయ సంవత్సరంలో 110 మంది పరీక్ష రాయగా 45 శాతం ఉత్తీర్ణులయ్యా రని పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో జి.సేవేందర్ చారి 960 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచాడని తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



అభయాంజనేయ స్వామి పూజలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి పేర్కొన్నారు. ఆకుతోటపల్లి గ్రామ పరిధిలో గౌరారం గ్రామంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం వేదపండితులు మంత్రోచ్ఛరణల మధ్య అభయాంజనేయస్వామి, శ్రీ గణపతి, ధ్వజస్తంభ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజలు దైవ కార్యాల్లో భాగస్వాములు కావాలని కోరారు. హోమాలు, యజ్ఞాలతో లోకకల్యాణం జరుగుతుందన్నారు. అనంతరం కసిరెడ్డి, ఆచారిలను ఆలయ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. మాజీ జెడ్పీటీసీలు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, హరిప్రసాద్, మాజీ సర్పంచ్ రజిత, ఎంపీటీసీ మంగమ్మ, టీడీపీ కల్వకుర్తి ఇన్‌చార్జి యాదీలాల్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావ్, ఆలయ కమిటీ కార్యదర్శి చిట్టిగోరి భాస్కర్‌రావ్, కోశాధికారి నిట్టె నారాయణ పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కాపాడుకోవాలి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న పర్వతాలు, నాయకులు

కొత్తూరు: పాలకుల కారణంగా కోల్పోయిన కార్మిక చట్టాలను మేడే స్ఫూర్తితో తిరిగి సాధించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు కార్మికులకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా పట్టణ సమీపంలోని నాట్కోఫార్మా ఆవరణలో ఆయన బుధవారం సీపీఐ మండల కార్యదర్శి షకీల్ ఆధ్వర్యంలో మే డే వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అనేక పోరాటాలు, బలిదానాలతో ఆనాడు కార్మికులు సాధించుకున్న 8 గంటల పనిదినాలు, కనీస వేతనాలు, బోనస్, ఈఎస్ఐ, పీఎఫ్ చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రస్తుతం నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. కేవలం కార్పొరేట్ సంస్థలకు మాత్రమే మేలు చేసేలా చట్టాలను సవరిస్తూ కార్మికులకు అన్ని రకాలుగా అన్యాయం చేస్తున్నాయని వివరించారు. చట్టాల సవరణతో కార్మికులకు కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ అందడం లేదన్నారు. కార్మికుల శ్రమతో కోట్లు గడిస్తున్న యాజమాన్యాలు వారి సంక్షేమాన్ని మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వాల తీరుతో కార్మికులు పెరుగుతున్న నిత్యావసర ధరలతో రెండు పూటల కూడా సక్రమంగా తినలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. తమ హక్కుల సాధనకు కార్మికులు ఐక్యంగా ఉండాలని ఆయన కోరారు. అంతేకాకుండా మే డే వేడుకల్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

దేశంలో కాంగ్రెస్ గాలి వీస్తోంది



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మధుసూదన్‌రెడ్డి తదితరులు

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి

షాబాద్: బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పికొట్టేందుకు సిద్ధమయ్యారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కొమరబండ, బొబ్బిల్లిగామ, ఊబగుంట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావడం కాయమని, దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తుందన్నారు. ఎవరూ ఎన్ని కుట్రలు చేసినా కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలన్నింటినీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాశనం చేసిందని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ ఊసేలేదని, బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు దూరమయ్యారన్నారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ఎంపీటీసీలు జయమ్మవెంకట్‌రెడ్డి, చెన్నమయ్య, మల్లేశ్, అశోక్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లు చెన్నయ్య, నర్సింహులు, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

లక్ష్మీ నరసింహాస్వామి దేవాలయ భూముల వేలం

కొందుర్గు: కొందుర్గు లక్ష్మీనరసింహా స్వామి దేవాలయానికి సంబంధించిన వ్యవసాయ భూములను మూడేళ్లపాటు కౌలుకు తీసుకొని సాగుచేసుకోవడం కోసం 27న వేలం వేయ నున్నట్లు దేవాలయ కార్యనిర్వాహక అధికారి శ్రీనివాసశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల రైతులు రూ.2 వేలు దరావత్ చెల్లించి 27న నిర్వహించే వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

షాబాద్: చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని నాగర్‌గూడ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కవిత, గ్రామ సంఘం అధ్యక్షురాలు రావుల లక్ష్మి అన్నారు. బుధవారం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తున్న హెచ్ఎం కవిత తదితరులు

మట్టి దందా..!

ఇష్టారాజ్యంగా జేసీబీలతో తవ్వకాలు

- చెరువులను తలపిస్తున్న భూములు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న యంత్రాంగం

కొత్తూరు: ముడుపుల మాయ.. అధికారుల అలసత్వం కారణంగా మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో టీఎస్ఐఐసీ సేకరించిన విలువైన పొలాల్లోని మట్టి వ్యాపారులకు కల్పతరువులుగా మారుతున్నాయి. రెండేళ్ల క్రితం చదునుగా ఉన్న పొలాలు ప్రస్తుతం భారీ యంత్రాలతో మట్టి, మొరం తవ్వకాలు చేపట్టడంతో చెరువులుగా దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం రైతుల నుంచి పొలాలు సేకరించిన తర్వాత వాటిపై పర్యవేక్షణ చేపట్టకపోవడంతో పలువురు మట్టి వ్యాపారులు యథేచ్ఛగా యంత్రాలతో మట్టి, మొరంను తవ్వి విక్రయిస్తున్నారు. గతేడాదిగా ఇక్కడ కోట్ల రూపాయాల విలువైన మట్టిని తవ్వి విక్రయించినట్లు సమీప గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధిపై ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అయినా సంబంధిత శాఖల అధికారులు పొలాల రక్షణకు చర్యలు చేపట్టడం లేదని స్థానికులు వాపోతున్నారు.

గత ప్రభుత్వం సేకరించిన భూములు..

మండలంలోని సిద్ధాపూర్ శివారులో 252, 278, 361 సర్వే నంబర్లలోని 330.34 ఎకరాల్లో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములను గత ప్రభుత్వం అసైన్డ్ రైతుల నుంచి సేకరించి టీఎస్ఐఐసీకి బదలాయించారు. కాగా 330.34 ఎకరాల్లో 97.24 ఎకరాలు ప్రభుత్వ పొలం. మిగితాది 240 ఎకరాలు అసైన్డ్ పట్టాలు ఉన్న రైతులవి. దీనికి గాను అప్పటి ప్రభుత్వం లబ్ధిదారులుగా ఉన్న 245 మంది రైతులకు ఎకరానికి రూ.10లక్షల చొప్పున పరిహారం సైతం అందజేశారు.

జోరుగా దందా..

హైదరాబాద్‌కు అతి చేరువలో, అంతర్జాతీయ విమానాశ్రాయానికి కూతవేటు దూరంలో ఉన్న కొత్తూరు మండలం అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఎప్పటికప్పుడూ కొత్త కొత్త పరిశ్రమలు, రియల్ వెంచర్లు, భారీ కట్టడాలు వెలుస్తున్నాయి. వీటి నిర్మాణానికి, చదును చేయడానికి వ్యాపారులకు భారీగా మొరం(మట్టి) అవసరం అవుతోంది. దీంతో వారు స్థానికంగా ఉన్న కొందరు మట్టివ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వారు సమాచారం బయటకు వెళ్లనీయకుండా కొందరికి ముడుపులు ఇస్తూ ప్రభుత్వ భూముల్లో నుంచి మట్టిని తవ్వేందుకు వ్యాపారులకు సహకరిస్తున్నారు. పెద్ద పెద్ద యంత్రాలతో వ్యాపారులు మట్టిని తవ్వడంతో పరిశ్రమలు, ఇతర ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు అనువైన పొలాలు చెరువులు, గుంతలను తలపిస్తున్నాయి.

కరువైన పర్యవేక్షణ..

గత ప్రభుత్వం సిద్ధాపూర్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంట్లు, ఐటీ హబ్ ఏర్పాటు చేసే యోచనలో భూములను సేకరించింది. రైతుల నుంచి పొలాలను సేకరించిన తర్వాత టీఎస్ఐఐసీతో పాటు రెవెన్యూ అధికారులు ఆ పొలాలపై సరైన నిఘా పెట్టలేదు. నెలల తరబడి భారీ యంత్రాలతో పగలు, రాత్రి మట్టిని తవ్వుతున్నా అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా విలువైన భూములు పనికిరాకుండా పోతున్నాయి.



మట్టిని తవ్వడంతో చెరువులను తలపిస్తున్న టీఎస్ఐఐసీ పొలాలు



మామిదోని చెరువులో ట్రాక్టర్‌లో నింపుతున్న మట్టి (ఫైల్)

చర్యలు తీసుకుంటాం



సిద్ధాపూర్‌లో టీఎస్ఐఐసీకి కేటాయించిన పొలాల్లో గతంలో కొందరు మట్టి తవ్విన ఘటనలు ఉన్నాయి. దీంట్లో పలువురు వ్యక్తులపై కేసులు నమోదయ్యాయి. మారోమారు అక్కడ తవ్వకాలు చేపట్టినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటల్లో నుంచి కూడా అనుమతులు లేకుండా మట్టి, మొరంను తవ్వొద్దు. ఎక్కడైనా అక్రమంగా తవ్వకాలు చేపడితే ప్రజలు మాకు సమాచారం ఇవ్వాలి.

– రవీందర్‌రెడ్డి, తహసీల్దార్, కొత్తూరు

అన్ని వర్గాలను మోసం చేస్తున్న కాంగ్రెస్

పంజగుట్ట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రెడ్డి కుల తత్వం పెరిగి పాకాన పడిందని దాన్ని వెంటనే తొలగించకపోతే రాష్ట్రంలో భవిష్యత్‌లో కాంగ్రెస్ అడ్రస్ లేకుండా పోతుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి వల్ల కాంగ్రెస్ గెలవలేదని అందుకు ఉదాహరణ మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్న రేవంత్ ఆయన పార్లమెంట్ పరిధిలో ఏడు ఎమ్మెల్యే సీట్లల్లో ఒక్కటి కూడా గెలవలేదన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రకులంలో రెడ్డిలను మినహాయించి ఏ కులానికి కూడా ఐదు కీలక పదవులు ఇవ్వలేదన్నారు. అన్ని కీలక పదవుల్లో, నామినేటెడ్ పోస్టుల్లో రెడ్డిలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ను గెలిపించడంలో రెడ్డి కులస్తులకన్నా ముస్లింలే ప్రముఖపాత్ర పోషించారని అన్నారు.



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ